క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

రణస్థలం: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో పైడిభీమవరం సబ్‌స్టేషన్‌లో పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.బయన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

తహసీల్దార్‌కు కలెక్టర్ పరామర్శ



వెంకటరావును పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

లావేరు: శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు తల్లి దుర్గమ్మ, భార్య పద్మజ ఈ నెల 11న మృతి చెందారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం లావేరు గ్రామానికి వెళ్లి తహసీల్దార్‌ను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు లావేరు తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, వీఆర్‌వో టి.లక్ష్మణరావు, మాజీ జెడ్పీటీసీ ఎన్.త్రినాథ్ తదితరులు ఉన్నారు.

తాళ్లవలసలో పారిశుద్ధ్య పనులు



పూడికలు తీయిస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని తాళ్లవలసలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికల తొలగింపు, చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించడం వంటి పనులను పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

లావేరు: వలసల నివారణకు ఉపాధి హామీ పథకం దోహదపడుతుందని, పథకాన్ని వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని గుమడాం పంచాయతీ ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు అన్నారు. పంచాయతీలో గురువారం ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పని చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబరు రేగిడి లక్ష్మణరావు, నాయకులు జగ్గురోతు తవిటినాయుడు, మీసాల రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

గార మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షునిగా జయరాం



సర్పంచ్‌ల సంఘ నూతన కార్యవర్గం

గార: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా అంపోలు పంచాయతీ సర్పంచ్ గొండు జయరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం గార మండల ప్రజాపరిషత్ కార్యాలయ వద్ద సంఘ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షులుగా బి.లలిత (కె.మత్స్యలేశం), ప్రధాన కార్యదర్శిగా అరవల అమ్మాజీ (అంబళ్లవలస), కార్యదర్శిగా సుంకాన సురేష్ (వాడాడ), కోశాధికారిగా కొంక్యాణ ఆదినారాయణ (శాలిహుండం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని ఎంపీపీ గొండు రఘురామ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీస శ్రీహరిరావు, జేసీఎస్ కన్వీనర్ కొయ్యాన నాగభూషణం, పీస గోపి, గొలివి వెంకటరమణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి తదితరులు అభినందించారు.

ఘనంగా రుద్రాభిషేకాలు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి గ్రామంలో గురువారం కర్రి అప్పలనాయుడు శారద, కర్రి వైకుంఠేశ్వరావు జానకి ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం చేపట్టారు.

సారా ప్యాకెట్లతో పట్టుబడిన మహిళ

సరుబుజ్జిలి: మండలంలోని సుబ్బపేట గ్రామానికి చెందిన మహిళ వద్ద 160 సారా ప్యాకెట్లు తోపట్టుబడినట్లు ఆమదాలవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ సీఐ కె. సునీల్‌కుమార్ గురువారం వెల్లడించారు.ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్



కోటపాలెంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, జగన్ పాలన.. జనం పాలనలా ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కోటపాలెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 584 గృహాలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సీఎం జగన్ వచ్చిన తర్వాత అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకపోయినా, సాంకేతిక సమస్యల వల్ల పథకాలు మంజూరు కాకపోయినా వెంటనే సరిచేయాలని గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, గొర్లె తిరుపతినాయుడు, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్‌నాయుడు, ఎంపీటీసీ సుంకరి కిషోర్‌కుమార్, చౌదరి రాము, గొర్లె అప్పలనాయుడు, యర్రబోలు నాగరాజు, సుంకరి ప్రసాద్, గొర్లె శశిభూషణరావు, సుంకరి పాపారావు, జోగ శ్రీను, లంక అప్పలనాయుడు, అల్లంపల్లి లక్ష్మణరావు, చౌదరి జగదీష్, మాతా ఉపేంద్ర, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పేదలు ఆపదలో ఉంటే నేనున్నానని ఆదుకోవడం సీఎం జగనన్న మంచి మనసుకు నిదర్శనమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కొయ్యాం పంచాయతీ పాతకూర్మినాయుడుపేటకు చెందిన జీరు సాయిలక్ష్మి కుటుంబసభ్యులకు రూ.15 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 278 మందికి సుమారు రూ.3 కోట్లు అందజేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్థాయిలో పేదల వైద్యానికి ఖర్చు చేసి ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. బూటకపు ప్రచారాలు, ప్రగల్భాలతో టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని, ప్రజల్లో ఆ పార్టీపై విశ్వసనీయత లేదని విమర్శించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల బాగోగులు తెలుసుకుంటూ అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నాం కాబట్టే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాదరణ పుష్కలంగా లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు రామారావు, చిల్ల వెంకటరెడ్డి, దుంప చిన్నారెడ్డి, జీరు అయ్యప్పరెడ్డి, తిరుమరెడ్డి సత్యనారాయణ, ఆబోతుల నరసింహమూర్తి, కిల్లారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి: జేసీ నవీన్



మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం కల్చరల్: ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఎన్.నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఎన్నో పథకాలను అందిస్తోందన్నారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎంఏ రఫీ మాట్లాడుతూ ఎంతో పురాతనమైన షాదీ ఖానా ఉందని, దాన్ని మోడలింగ్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు మాట్లాడుతూ ముస్లింలను మొదటగా వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తించి వారికి 4శాతం రిజర్వేషన్ కల్పించారని, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ముస్లిం పురోగతికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారిలావణ్య, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ లక్ష్మి, ఖాన్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



శ్రీకాకుళం క్రైమ్ : అవగాహన కల్పిస్తున్న జిల్లా అగ్నిమాపక సహాయాధికారి ఎం.వరప్రసాద్



రణస్థలం: వైద్యసిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి అశోక్

శ్రీకాకుళం క్రైమ్ : అగ్నిమాపక వారోత్సవాల చివరిరోజు సందర్భంగా జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో సహాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. స్థానిక డ్వాక్రా గ్రూపుల మహిళలు, విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మాన్ శృంగార నాయుడు, సిబ్బంది పాపారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్, ఆయిల్ వంటి వస్తువుల ద్వారా మంటలు చెలరేగినప్పుడు వాటిని ఎలా ఆర్పాలో తెలియజేశారు. నివారణ చర్యల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రణస్థలం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎం.వి.ప్రసాదరావు, అగ్నిమాపక సిబ్బంది కె.పోలినాయుడు, బి.ప్రసాద్, ఎ.రాము, జి. లక్ష్మణ, యు.రవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో అభివృద్ధి

లావేరు: కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇజ్జాడ శ్రీనివాసరావు అన్నారు. బెజ్జిపురం జంక్షన్‌లో గురువారం బీజేపీ భూత్ స్వశక్తీకరణ సమావేశం నిర్వహించారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు, కమిటీల నియామకం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పీవీ రత్నం, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్పర్తి ఆదెయ్య, వీరబాబు, వైస్ ప్రెసిడెంట్ ఇప్పిలి శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షురాలు దేవుడమ్మ, మాజీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

నిద్దాంలో వైద్య శిబిరం



వైద్యసేవలందిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పొన్నాడ హరితాశ్రీ, యశ్వంత్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పేడాడ సత్తెరాజు, భాస్కరరావు, రమాదేవి, ఉమా, ఏఎన్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

షిర్డీసాయి మందిరంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: నగరంలోని విశాఖ-బీ కాలనీలో షిర్డీ సాయిబాబా మందిరం వద్ద జిల్ ఫౌండేషన్ న్యూ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, ఫౌండేషన్ అధ్యక్షుడు, సత్యసాయి సభ్యులు సంతోష్, శివ, ఉమ, అఖిలభారత బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడు జాడ సాయి, న్యూబ్లడ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ పి.మణికంఠ, ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నాగేశ్వరరావు, శ్రీశ్రీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్, మందిర కమిటీ సభ్యులు సాంబశివరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో దంత వైద్య శిబిరం



దంతాలను పరీక్షిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్ జాతీయ సేవా పథకం యూనిట్ -7 ప్రత్యేక సేవా శిబిరం కొనసాగుతోంది. గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించి దంతాల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఉషా డెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పి.కల్యాణచక్రవర్తి, డాక్టర్ జి.గౌతమి ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.అనురాధ, సర్పంచ్ టి.జయలక్ష్మి, ప్రోగ్రాం అధికారి టి.భవాని పాల్గొన్నారు. కాగా, శిబిరంలో భాగంగా శుక్రవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. త్రినేత్ర సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు బొడ్డేపల్లి అనూష బృందం వైద్య సేవలు అందజేయనుందని పేర్కొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



ఇబ్రహింబాద్‌లో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంక్షేమ రథసారథి సీఎం జగన్ అని నాయకులు పేర్కొన్నారు. ఇబ్రహింబాద్, దోమాం గ్రామ పంచాయతీల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇళ్లకు స్టిక్కర్లు అతికించి కరపత్రాలుఅందజేశారు. ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, సర్పంచ్ సూర కృష్ణవేణి, నాయకులు బొచ్చ నర్సింగరెడ్డి, బోర గన్నయ్య రెడ్డి పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని గుర్రాలపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.స్థానిక సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, ఎంపీటీసీ జనపాల భానోజీరావు, సచివాలయం కన్వీనర్ శాంతాటి శ్రీనివాసరావు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లంపల్లి నాగరాజు, గట్టెం కృష్ణ, అల్లంపల్లి గోవిందరావు, లుట్ట శ్రీను, ఎస్.అప్పారావు, కె.పున్నారావు, ఎ.శ్రీను, డి.రామారావు, బి.గోవిందరావు, ఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.



దోమాంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న నాయకులు



గుర్రాలపాలెంలో పథకాలు వివరిస్తున్న నాయకులు, సచివాలయ కన్వీనర్లు

నూతన వలంటీర్లకు నియామక పత్రాలు



వలంటీర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో నూతనంగా నియామకమైన పది మంది వలంటీర్లకు ఎంపీపీ మొదలవలస చిరంజీవి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కొయ్యాం, కేశవరావుపేట, పొన్నాడ, ఎస్ఎంపురం, కొంగరాం, భగీరథపురం, బుగడుట్లపాలెంలో వీరిని నియమించారు. పారదర్శకంగా పథకాలు అందజేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, నాయకులు, ప్రజాప్రతినిధులు బెండు రామారావు, బగ్గు రాజారావు, దుంప చిన్నారెడ్డి, ముద్దాడ శంకర్, కారి తాతారావు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమికి మేలు



సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



కొత్తూరు: మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

సరుబుజ్జిలి: నవధాన్యాలు సాగుతో జీవవైవిధ్యం పెరిగి భూమికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీ బాబాజీ తెలిపారు. మండలంలోని రావివలస యూనిట్ పరిధిలోని పాలవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. పాలవలస సర్పంచ్ గజ్జన మోహన్‌రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సాగు శ్రేయస్కరం

కొత్తూరు: భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలు ఆధారంగా పంట సాగు చేయడం మంచిదని కర్లెమ్మ గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయకురాలు, ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కర్లెమ్మలో గురువారం వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయం శాఖ ఉమ్మడి భూసార పరీక్షలు కోసం మట్టి నమూనాలను సేకరించారు. భూసార పరీక్షలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



ప్రచార బేరీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

హిరమండలం: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రం బస్‌స్టాండ్ ఆవరణంలో గురువారం ప్రచార బేరీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రజా సొమ్ము ధారాత్తం చేస్తోందని ఆరోపించారు. దళిత, గిరిజన, రైతు, కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. అనంతరం ప్రచార బేరీ పోస్టర్లు ఆవిష్కరించారు. సీపీఎం సీనియర్ నేత ఎం.అప్పారావు, రమణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం

కొత్తూరు: ఈ నెల 21వ తేదీన 27.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయనున్నారు. ఈ మేరకు సీఎస్ డీటీ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఏడాది జనవరి ఒకటో తేదీన ఈ బియ్యం పట్టుబడ్డాయన్నారు. కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మూడు గంటలకు వేలం పాట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

తాగుతూ.. ఊగుతూ..!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా 80 అడుగుల రోడ్డు
- ఖాళీ స్థలాల్లో మద్యం, మత్తు పదార్థాల వినియోగం
- బైక్ రేసులకు ఇదే మార్గం..
- సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఇదే తంతు



నగరంలోని 80 అడుగుల రోడ్డు

శ్రీకాకుళం:

శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల (ఫీట్) రోడ్డులో ఖాళీ స్థలాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత యువకులు బృందాలుగా వచ్చి మద్యపాన సేవనం, మత్తు పదార్థాలు వినియోగించడం పరిపాటిగా మారింది. అర్ధరాత్రి వరకు ఇలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తర్వాత మత్తులో ఏం చేస్తున్నారో గ్రహించలేని పరిస్థితుల్లో అరాచకాలకు పాల్పడుతున్నారు. సుమారు ఎనిమిది నెలల క్రితం గూనపాలెంలో వార్డు వలంటీరు హత్య, పలు ద్విచక్ర వాహనాలు దగ్ధం చేయడం వెనుక మత్తుబాబులు ఉన్నారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నాలుగు రోజుల క్రితం 10కి పైగా కార్లను ధ్వంసం చేసి విధ్వంసం సృష్టించగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇది కూడా మద్యం మత్తులో జరిగిన పనేనని పోలీసులు నిర్ధారించారు. సీసీ ఫుటేజీలు దర్యాప్తులో కీలకంగా మారనున్నాయి. కొందరు యువకులు చీకట్లో సెల్‌ఫోన్ లైటింగ్‌లోనే గంటలు గంటలు ఉంటున్నారు. ఖాళీప్రదేశాల్లో విష సర్పాలు సంచరిస్తున్నప్పటికీ మందుబాబులు స్పందించటం లేదు. వీరిలో కొందరు తమ ఇళ్ల, వీధుల్లో అలజడులు సృష్టిస్తున్నా సద్దుమణిగి వెలుగులోకి రావటం లేదు. అలాంటి ఘటనలు స్థానిక పెద్దల రాజీతో మరుగున పడిపోతున్నాయి. అత్యాచారాలు, ఇతర నేరాలు కూడా ఇటువంటి వారిపనే అని ప్రచారంలో ఉంది. మరోవైపు బైకు రేసులకు కూడా కొందరు ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. విపరీతమైన వేగంతో వెళ్తూ పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మొత్తమ్మీద చీకటి పడితే 80 రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, స్థానికులు భయపడుతున్నారు. ముఖ్యంగా మహిళలు మరింత ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు దృష్టి సారించి నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిఘా పెంచాం



నగరంలోని అనేక ప్రాంతాలపై ఇప్పటికే నిఘా పెంచాం. గతంలో పలువురిని అదుపులోకి తీసుకుని హెచ్చరించి విడిచిపెట్టాం. ఇకపై ఎవరినీ వదిలేదు లేదు. కేసులు నమోదు చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే మా దృష్టికి తీసుకుని రావాలి.

– బి.గణేష్, ఒకటో పట్టణ ఎస్సై, శ్రీకాకుళం